## అనుబంధం

ఆ పేటలో కొత్తగా దిగిన జంట సుబ్బలక్ష్మి, సుబ్బారావు. ఇద్దరూ చిలకాగోరింకల్లా కాపురం చేసుకుంటున్నారు. సుబ్బారావుకి ఆఫీసు ఫైళ్లలో కూడా సుబ్బలక్ష్మే దర్శనమిస్తూ ఊరిస్తుంటుంది. ఇక సుబ్బలక్ష్మి ఇంట్లో ఒంటరిగా వున్నంతసేపూ సుబ్బారావు చేసే చిలిపి పనులను తల్చుకుంటూ మధురోహల్లో తేలియాడుతూ వుంటుంది!

'వినాయకచవితి పండక్కి అల్లుణ్ణీ, కూతుర్నీ తమ వద్దకు వచ్చి తమ గృహాన్ని పావనం చేయవలసింద'న్న మామగారి విన్నపాన్ని మన్నించి, భార్యతో అత్తగారింటికి వారి మర్యాదలందుకోడానికి బయలుదేరాడు సుబ్బారావు.

ముందుగానే రిజర్వేషన్ చేసుకోవడంవల్ల ఇబ్బంది లేకుండా రైల్లోకి జొరబడ్డారు భార్యాభర్తలు. ఒకరిని విడిచి ఒకరు వుండలేనంత ''ఇది''గా అంటుకుని కూర్చున్నారు. బోగీలో అందరూ నిద్రపోతున్నా వీళ్ళు మాత్రం చిలిపి ఊసుల్లో, కొంటె చేష్టల్లో మునిగిపోయారు. 'పెళ్లయిన కొత్తలో మేమూ ఇంతేలేవోయ్' అన్నట్లుగా ముసిముసిగా నవ్వుకున్నారు వయసుమళ్ళిన వాళ్ళు. 'ఈ మధుర క్షణాలు మనకెప్పుడు రానున్నాయో'నని అశాంతిగా నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతున్నారు దొంగచాటుగా వీళ్ళనే గమనిస్తున్న కుర్రకారు.

'ఏవండీ! మిమ్మల్ని వదలి ఒక్క క్షణం కూడా బ్రతకలేనండీ' గుసగుసగా అంది సుబ్బలక్ష్మి.

'నా ప్రాణం పోయినాసరే నిన్ను విడిచి నేనుండలేను' ఆవేశంగా అంటూ ఆమె చేయిని నొక్కాడు.

వీళ్ళందరితో నిమిత్తం లేకుండా రైలు తన మానాన తను పరుగులు తీస్తూ వెడుతోంది. ఇంతలో 'ధఢేల్'మంటూ పెద్ద చప్పుడు! రైలు ఒక్కసారిగా పెద్ద కుదుపుతో అటూ ఇటూ ఊగిపోయింది. రైలు పడిపోయిందేమోననే భ్రాంతి! బోగీలో ఎవరికి వాళ్ళు కంగారుగా ప్రాణభయంతో పరుగులు తీస్తున్నారు. రైలు ఆగింది. అంతా కలకలం! తలుపులు తీసుకుని, ఒకర్నొకరు త్రోసుకుంటూ బయటకు దూకి బ్రతుకు జీవుడా అని ప్రాణాలరచేత పట్టుకొని పరుగులు తీయడం ప్రారంభించారు.

తుప్పల్లో అడ్డంగా పడి పరుగెడుతున్న సుబ్బలక్ష్మి ఆయాసంతో రొప్పుతూ 'ఇక నా ప్రాణానికే ప్రమాదమూ లేదు' అనుకుంది. మరోవైపు క్రిందా మీదా పడి పరుగెడుతున్న సుబ్బారావు అచ్చంగా ఇలాగే అనుకున్నాడు! అప్పుడు గుర్తొచ్చారు ఒకరికొకరు. గుర్తొచ్చినవే వాళ్ళ ఊసులూ, బాసలూ. భర్త తనని అసహ్యించుకుంటాడేమోనని భార్య, భార్య తనని ఈసడిస్తుందేమోనని భర్త శంకిస్తూనే ఒకరినొకరు వెదుక్కుంటూ కలుసుకున్నారు.

'ఏవండీ! మీరు లేకుండా నేను...' కన్నీళ్ళతో, గొంతు పూడుకుపోగా అతన్ని అల్లుకుపోయింది సుబ్బలక్ష్మి! భార్య అనురాగానికి పరవశిస్తూ లోలోపలే ఆనందించాడు సుబ్బారావు భార్యను కౌగిట్లోకి తీసుకుంటూ! ''అమ్మయ్య నన్నుమానించలేదు'' తృప్తిగా మూలిగింది సుబ్బలక్ష్మి మనసు!

— కె.వి.కృష్ణయ్య

# మరణమృదంగం
# ఆఖరిపోరాటం
# రుద్రనేత్ర

## యండమూరి వీరేంద్రనాథ్



తాజాగా రాస్తున్న సీరియల్

?

వచ్చే సంచికలో...